క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



గంగరాజును అభినందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) / దెందులూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నిట్టా గంగరాజు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా ఇటీవల నియమితులైన గంగరాజును దెందులూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ఎస్సీ నాయకులు శనివారం ఏలూరులోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో ఆయన్ని సత్కరించారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని గంగరాజు అన్నారు. పార్టీ కార్యకర్తలకు పూర్తి స్థాయిలో అండదండలు అందజేస్తానని తెలిపారు. గంగరాజును కలిసిన వారిలో పార్టీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు, గంటా పండు, కొరపాటి రాజా, బొడ్డు నాగరాజు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో పదవులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో పలువురికి పదవులు లభించాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గానికి చెందిన యర్రగోగు ధనంజయ నాయుడు యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా, పత్తిపాటి విక్టర్ జిల్లా కార్యదర్శిగా, పాలూరి రమేష్, పాము స్వామి కుమార్ (శ్యామ్), గంధం మహేష్ (బాబి)లను కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉమామహేశ్వరరావు మృతికి సంతాపం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ

ఏలూరు టౌన్: ఏలూరుకు చెందిన గణపతి ఖాదీ వస్త్ర సంఘం సభ్యుడు కొమ్మన ఉమా మహేశ్వరరావు మృతిచెందారు. ఆయన మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని ప్రకటించారు. జేపీ వెంట గుడిదేశి శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవి, కొల్లిపాక సురేష్, కొల్లిపర భగవాన్, ఉదయ్‌భాస్కర్, పదం రాము, దవులూరి రవి, పరమేశ్వరి తదితరులు ఉన్నారు.

లోన్ల పేరుతో మాయాజాలం

- ఆధార్, పాన్‌కార్డుతో నకిలీ పత్రాలు
- నకిలీ ఇంటి పత్రాలు తయారు చేస్తూ బురిడీ
- బాధితుల గగ్గోలు



ఏలూరు టూటౌన్ పరిధిలో లోన్స్ పేరుతో మోసాలపై వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్ (ఫైల్)



లోన్ల పేరుతో మోసానికి పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేసిన టూటౌన్ పోలీసులు (ఫైల్)

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ప్రైవేట్ సెక్టార్‌లోని ఫైనాన్స్ బ్యాంకింగ్‌లో లోన్ల పేరుతో భారీ ఎత్తున మాయాజాలం. పోలీసుల విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెల్లడైనట్టు చెబుతున్నారు. ఆయా ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకుల్లో పనిచేస్తోన్న సిబ్బంది, కొందరు మాయగాళ్లు అసలు ఆస్తి లేకున్నా, నకిలీ డాక్యుమెంట్స్ పుట్టించి మరీ పెద్దమొత్తంలో సొమ్ములు కాజేస్తున్నట్టు తెలిసింది. తెలియని వ్యక్తి ఇంటివద్ద నిలబడి ఫొటోలు దిగి, అదే ఇంటి ఆస్తి పత్రాలను నకిలీవి సృష్టిస్తున్నారు. వీటితో మరోక వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేస్తూ కొత్త పత్రాలు తీసుకుంటున్నారు. అనంతరం వాటితో ప్రైవేటు బ్యాంకుల్లో లక్షల్లో రుణాలు తీసుకుంటున్నారు. తీరా నెలవారీ వాయిదా కట్టలేదని, ఇంటి యజమాని వద్దకు వెళ్లగా తాము అసలు బ్యాంకు లోన్ తీసుకోలేదని లబోదిబో మంటున్నారు. ఇంతకీ ఈ బ్యాంకు లోను ఎవరు కట్టాలి. కట్టకపోతే ఎవరి ఆస్తిని స్వాధీనం చేసుకోవాలి అనే విషయాలపై ప్రైవేటు సెక్టార్ బ్యాంకుల అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

లోను ఇవ్వకుండానే ఇచ్చామంటున్నారు!

ప్రజలు తమ విలువైన ఆధార్, పాన్ కార్డుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. లోను కోసం వెళ్లిన సందర్భంలో ప్రైవేటు బ్యాంకుల్లోని సిబ్బంది కస్టమర్ల ఆధార్, పాన్ కార్డులను తీసుకుంటారు. అనంతరం సిబిల్ బాగోలేదని, ఆదాయం సరిపోవటం లేదని, ఏదో ఒక కారణంగా బ్యాంకులు లోను ఇవ్వకుండా రిజెక్ట్ చేస్తుంటారు. ఇదే అదనుగా ఫైనాన్స్ కంపెనీల్లో పనిచేసే సిబ్బంది అవే పాన్‌కార్డులు, ఆధార్ కార్డుల ఆధారంగా ఆస్తులకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి వారి పేరుతోనే భారీగా లోనులు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. తాము బ్యాంకులకు లోన్ల కోసం వెళ్లిన మాట నిజమే కానీ, తమకు ఫైనాన్స్ కంపెనీ వారు లోను ఇవ్వలేదని, తమ పేరుతో లోన్ ఏలా వచ్చిందంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

షట్‌డౌన్ దశలో ఫైనాన్స్ కంపెనీలు

ఏలూరు నగరంలో పలు కేసులకు సంబంధించి పోలీస్ అధికారులు దర్యాప్తు చేశారు. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఫైనాన్స్ కంపెనీలు ఆర్థిక మోసాలతో షట్‌డౌన్ దశకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆర్ఆర్‌పేటలోని కొన్ని ప్రైవేటు బ్యాంకుల్లో ఏకంగా రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు లోన్ల పేరుతో మోసాలకు పాల్పడినట్లు చెబుతున్నారు. బ్యాంకుల సిబ్బందితో పాటు, కొందరు బ్రోకర్లుగా వ్యవహరిస్తూ నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించి బ్యాంకు సొమ్ములు కాజేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఆర్థిక మోసాలపై సదరు బ్యాంకుల అధికారులు పోలీస్ విచారణకు ఫిర్యాదులు కూడా చేయకపోవటం గమనార్హం. ఆర్థిక నష్టాలను కస్టమర్లపై వేయటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోసగాళ్లపై కేసులు పెట్టి సొమ్ములను రికవరీ చేసుకోవటంపై శ్రద్ధ చూపాలని వినియోగదారులు కోరుతున్నారు.

రూ.2.50 కోట్లకు టోకరా

ఏలూరు టూటౌన్ పరిధిలో పవర్‌పేటలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో నకిలీ పత్రాలతో ఏకంగా రూ.2.50 కోట్లకు టోకరా వేశారు. కస్టమర్లు ఎవరూ లేకున్నా, నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకులో పనిచేసే సిబ్బందితో పాటు, లోన్ బ్రోకర్లు భారీ ఎత్తున మోసానికి పాల్పడ్డారు. ఇతరుల ప్రాపర్టీలకు నకిలీ పత్రాలు సృష్టించటం, లోన్ల కోసం వచ్చిన వారి ఆధార్, పాన్ కార్డులను వినియోగిస్తూ బ్యాంకులను బురిడీ కొట్టించి పెద్దెత్తున సొమ్ములు స్వాహా చేసినట్లు ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ విచారణలో వెల్లడైంది. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, మరికొందరు ఈ నేరంలో పాత్రదారులపై విచారణ కొనసాగుతోంది.

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు తమ ఆధార్, పాన్ కార్డుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఫైనాన్స్ కంపెనీల్లో లోన్ల కోసం వెళ్లిన సందర్భంలోనూ ఆధార్, పాన్‌కార్డు, ఇతర ఆస్తి పత్రాల జిరాక్స్‌లు ఇచ్చే క్రమంలో జాగ్రత్తలు పాటించాలి. ఫైనాన్స్ కంపెనీల్లోని మోసగాళ్లు సాధారణ వ్యక్తులను, అమాయకులను మోసం చేస్తూ వారి ఆస్తి పత్రాలు నకిలీవి సృష్టించి వాటితో లోన్లు తీసుకుంటూ బ్యాంకులను మోసం చేస్తున్నారు. అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు వంటివి చెప్పకూడదు.

– డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు డీఎస్పీ

కొత్తపేటలో భగవద్గీత ప్రవచనం



భగవద్గీత ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట శ్రీ కల్యాణ వేంకటేశ్వర, శ్రీ రామాలయ, గౌరీ శంకర, సాయి మందిర్ ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు ఇస్కాన్ ప్రతినిధులు భగవద్గీత ప్రవచనం, హరినామ సంకీర్తనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రకాశాచార్యులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదం వితరణ చేశారు.

సేవా కార్యక్రమాలను విస్తరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జోన్3 పరిధిలోని వివిధ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రతి నెలా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని లయన్స్ జోన్ 3 చైర్‌పర్సన్ ఎ.సర్వేశ్వర రావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ కార్యాలయంలో జోన్ 3 పరిధిలోని ఏలూరు విజన్ లయన్స్ క్లబ్, ఏలూరు స్మార్ట్ సిటీ, ఏలూరు స్మార్ట్ ఫార్మర్స్, ఏలూరు స్మార్ట్ ప్రొఫెషనల్స్ క్లబ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు ఎల్ వెంకటేశ్వర రావు, చుక్కా అవినాష్, ఎ.శేషు కుమార్, బీవీ రమణ మూర్తి, ఆర్‌వీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన వెంకన్న భూమి స్వాధీనం

కోర్టు ఆదేశాలతో భూమిలో ఫ్లెక్సీ ఏర్పాటు

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో అన్యాక్రాంతమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఎకరం భూమిని కోర్టు ఆదేశాల మేరకు శనివారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దేవస్థానానికి చెందిన భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఫ్లెక్సీను ఏర్పాటు చేశారు. వివరాల ప్రకారం 1957వ సంవత్సరంలో దాత వగ్వాల వెంకటరామారావు జిల్లా సబార్డినేట్ జడ్జి ద్వారా వారి ఆస్తులను వారసులకు పంచుతూ ఆయన కులదైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి 76/2ఏ సర్వే నెంబర్‌లో ఎకరం భూమిని కుమార్లు, కుమార్తెలు, కుటుంబ సమ్మతితో ఇచ్చారు. అయితే ఆ భూమిని అదే గ్రామానికి చెందిన వగ్వాల కృష్ణమూర్తి అక్రమంగా తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆలయ కమిటీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఆ భూమి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయానికి చెందాలని గతంలో కోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు కోర్టులో కేసు గెలిచి, కోర్టు ఆర్డర్ పొందారు. దీంతో ఆ భూమిని దేవదాయ శాఖ చట్టం 26/2023 ద్వారా దేవస్థానం, పోలీస్, రెవెన్యూ అధికారులు సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి కూచిపూడి శ్రీనివాస్, తనిఖీ అధికారి బాబూనాయుడు, ఈఓ కె.వంశీ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే బహిష్కరణ

ఏలూరు (టూటౌన్): క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సీపీఎం నుంచి బహిష్కరణకి గురైన బి.సోమయ్య పార్టీ నాయకత్వంపై చేసిన విమర్శలను ఏలూరు నగర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ నగర కార్యదర్శి పంపన రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరన్నర కాలంలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సోమయ్యపై పార్టీ జిల్లా కమిటీ ఏకగ్రీవ నిర్ణయంతో సస్పెండ్ చేసిందని తెలిపారు. అయినా సోమయ్య ప్రవర్తనలో మార్పు రాకపోగా నాయకత్వంపై అవాస్తవ బహిరంగ ఆరోపణలకు దిగారని వివరించారు. పార్టీ పూర్తికాలం కార్యకర్తగా పని చేసిన సోమయ్యకి కమ్యూనిస్ట్ పార్టీలో వ్యక్తిగత నిర్ణయాలు ఉండవని తెలియనట్లు నాయకులపై వ్యక్తిగత విమర్శలకు దిగటం సమంజసం కాదని హితవు పలికారు. సోమయ్య సస్పెండ్, బహిష్కరణ నిర్ణయాలు జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఉమ్మడి అభిప్రాయంతో జరిగిందని తెలిపారు. సీపీఎం అభివృద్ధి కోరుకొనే ఏ వ్యక్తీ బహిరంగంగా సోషల్ మీడియాకు ఎక్కే ప్రయత్నం చేయబోరని పేర్కొన్నారు.

ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగిపోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి సుఖ శాంతులతో జీవించేలా గణేషుడు ప్రతి ఒక్కరినీ ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయ ప్రకాష్ ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక తంగెళ్లమూడి వంతెన నెరుసు కాంప్లెక్స్ వద్ద గల వినాయక మండపం కమిటీ ఆహ్వానం మేరకు ఆయన వినాయకుడిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని జేపీ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, జిల్లా బీసీ ప్రధాన కార్యదర్శి కొల్లిపాక సురేష్, స్థానిక నాయకులు చిట్టి బొమ్మ రామకృష్ణ, వెలివెల పండు, సాగు రాజు, కాగితాల వెంకన్న, చిట్టిబొమ్మ రాంబాబు, చిట్టిబొమ్మ గణేష్, నగర నాయకులు పాల్గొన్నారు.

- సత్రంపాడు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి మోదుకార్చన నిర్వహించారు. స్వామి వారికి మోదుకాలతో ప్రత్యేకంగా మోదుక గణపతి అలంకరణ చేశారు. సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత శ్రీ లక్ష్మీ గణపతి స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిననాగేశ్వర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.
- ఆదివారపుపేట ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నగరపాలకోన్నత పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన మండపంలో స్వామి వారిని అధిక సంఖ్యలో మహిళ భక్తులు దర్శించుకున్నారు. పిండి వంటలతో అరటిపండ్లు, కొబ్బరికాయలు, పువ్వులు, పసుపు, కుంకుములతో మండపానికి విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ షిర్డీ సాయి ప్రేమ్ మందిర్ సాయి మహిళా భక్తుల ఆధ్వర్యంలో గణనాథుని సంకీర్తనలు, కోలాట నత్య ప్రదర్శన నిర్వహించారు.



గణనాథుని పూజల్లో పాల్గొన్న జయప్రకాష్



ఆదివారపు పేటలోని ఓ మండపంలో..



గణపతికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సత్రంపాడులో లక్ష్మీ గణపతి

మహేశ్వరపురం గ్రామంలో

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురం గ్రామంలో మేరీ మాత టవర్ సమీపంలో విగ్నేశ్వరస్వామికి శుక్రవారం మహేశ్వరపురం గ్రామ యూత్ పూజలు చేసింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించింది.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	38	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	38	బీన్సచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	36	ముల్లక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	46	కంద	00
కాకర కాయలు	32	బీట్‌రూట్	36
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	40-48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	09
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	15
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	09
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	01
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	02
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

దెందులూరు: అదనపు విద్యుత్ వినియోగం క్రమబద్ధీకరణ గడువు డిసెంబర్ 31 వరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ పొడిగించిందని అసిస్టెంట్ ఇంజినీర్ నరసయ్య తెలిపారు. ఏలూరు రూరల్ మండలంలో విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వం ఇచ్చే రాయితీని పొందాలని ఆయన కోరారు.

సీపీఎం నేత విమల మృతి

ఏలూరు (టూటౌన్): సీపీఎం నాయకురాలు గారపాటి విమల (94) ఏలూరు ఎన్ఆర్‌పేటలోని తన స్వగృహంలో శనివారం ఉదయం మృతి చెందారు. సీపీఎంలో సుదీర్ఘకాలం పని చేసిన ఆమె ఉపాధ్యాయ, మహిళా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. ఆమె మృతదేహం వద్ద సీపీఎం నాయకులు వై.వెంకటేశ్వరావు, బి.బలరాం, మంతెన సీతారాం, ఎ.రవి, పి.హైమావతి, ఎ.శ్యామలరాణి తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విమల మృతదేహాన్ని ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి అప్పగించారు.

శ్రీనివాసానంద సరస్వతి క్షమాపణ చెప్పాలి

చింతలపూడి : తిరుపతిలో హతీరామ్ బావాజీ మఠాన్ని కూల్చాల్సిందేనని 16 కోట్ల బంజారాల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన శ్రీనివాసా నంద సరస్వతి తక్షణం క్షమాపణ చెప్పాలని ఎస్టీ బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 27న శ్రీనివాసనంద సరస్వతి హతీరామ్ బావాజీ మఠం నిర్మాణాలను తొలగించాలని చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. శనివారం చింతలపూడిలో సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్యా నాగేశ్వరావు నాయక్, జి.కృష్ణ నాయక్‌లు మాట్లాడారు. 126 సంవత్సరాల చరిత్ర గల హతీరామ్ బావాజీ మఠంపై కుట్రపూరిత చర్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మఠం ఆస్తులను కాపాడేందుకు స్పష్టమైన ఆదేశాన్ని జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధారావతు కిమ్యా నాయక్ ,ధారావతు రాజబాబు నాయక్ పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం



ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొన్న కంభం విజయరాజు, జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయటమే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు సూచించారు. పార్టీ జంగారెడ్డిగూడెం మండల ముఖ్య నాయకులు సమావేశం శనివారం జంగారెడ్డిగూడెంలో పార్టీ మండల అధ్యక్షులు ఓరిగంట నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కంభం విజయరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావులు పాల్గొన్నారు. పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులను నియమించారు. మండల యువజన విభాగానికి గంజీ వినోద్, మండల మహిళా విభాగానికి గోలి వెంకటరత్నం, మండల బీసీ సెల్ విభాగానికి కొయ్య లీలాధర్ రెడ్డి, ఎస్సీ సెల్ విభాగానికి సిర్రా రాజేష్, క్రిస్టియన్ సెల్ విభాగం అధ్యక్షుడిగా అడవికొట్టు చంద్రశేఖర్‌లు నియమితులయ్యారు. వీరని అతిథులు అభినందించారు.

పార్టీకి పెరిగిన ఆదరణ

ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మండల స్థాయి నాయకులు కృషి చేయాలన్నారు. జెట్టి గురునాథరావు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పాలనలో విఫలమైందని, ప్రజలలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరిగిందని తెలిపారు. త్వరలో గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర కుమార్, మండల సమన్వయ కమిటీ నాయకులు కనికెళ్ల ప్రసాద్, నులకని వీరస్వామి నాయుడు, ముప్పిడి శ్రీనివాసరావు, ఇర్ల శ్రీనివాస్ రెడ్డి, గురజాల పార్థసారథి, తానిగడప రామకృష్ణ, వామిశెట్టి హరిబాబు, కుక్కల ధర్మరాజు, బీవీఆర్ చౌదరి, పెద్దలు పోల్నాటి ప్రభాకర్, మల్లిడి బాబి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

భోజన పథకం అమలుపై ఆరా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజయకృష్ణ

కామవరపుకోట: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఒంటిపల్లి విజయకృష్ణ అన్నారు. శనివారం కామవరపుకోట మండలం అడమిల్లి అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీయూపీ పాఠశాల, జెడ్పీ పాఠశాలల్లో తనిఖీలు చేశారు. విద్యార్థుల హాజరు, వంట, సరుకుల నిల్వ వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. పరిశుభ్రత పట్ల దృష్టి సారించాలన్నారు. జెడ్పీ హై స్కూల్లో నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రాన్ని వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. భోజనం తయారీ విషయంలో విద్యార్థులు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని, సిబ్బంది పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పోలవరం రూరల్: పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ ఎల్ సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలవరం, చేగొండిపల్లి, కుంకాల హైస్కూల్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వి.సూర్యనారాయణ మూర్తి, సీఆర్‌పీలు దిలీప్‌కుమార్, దామోదర్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.